# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సింహాచలంలో క్యూలైన్ గోడ కూలి భక్తులు మరణించిన ఘటనపై విచారణ చేపట్టి 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కమిటీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- ❖ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొతిరెడ్డిపాలెం వద్ద ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించారు.
- ❖ వైద్య విద్యా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ – 2025 పరీక్ష వచ్చే నెల 4వ తేదీన జరగనుంది.
- ❖ ప్రకృతి వైపరీత్యంతో ఈరోజు సింహాచలంలో జరిగిన ప్రమాదం చాలా విషాదకరమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు.
- ❖ రాష్ట్రంలో కొన్ని చోట్ల రేపు గంటకు 40 -50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

సింహాచలంలో క్యూలైన్ గోడ కూలి భక్తులు మరణించిన ఘటనపై విచారణ చేపట్టి 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కమిటీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ చీఫ్ వెంకటేశ్వరరావులతో కమిటీ ఏర్పాటైంది. కాగా ఈరోజు చందనోత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు నిన్న రాత్రి నుంచే భక్తులు భారీ సంఖ్యలో సింహగిరిపైకి చేరుకున్నారు. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురుస్తున్న సమయంలో క్యూలైన్ లో ఉన్న భక్తులపై గోడ కూలిపోవడంతో ఏడుగురు చనిపోగా ముగ్గురు గాయాలపాలయ్యారు.

========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోతిరెడ్డిపాలెంలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ముంబై జాతీయ రహదారిపై పోతిరెడ్డిపాలెం వద్ద పెట్రోల్ బంకు వద్దకు రాగానే అదుపు తప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం ప్రకటించారు.

=======================

పిడుగులు, గాలివాన బీభత్సంతో ఈ రోజు సింహాచలంలో జరిగిన ప్రమాదం చాలా విషాదకరమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ ప్రాంతంలో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయల పరిహారం, గాయపడిన వారికి 3 లక్షల రూపాయల పరిహారం అందించనున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

=======================

వైద్య విద్యా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ – 2025 పరీక్ష వచ్చే నెల 4వ తేదీన జరగనుంది. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి చిత్తూరు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణపై ఈరోజు జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని పివికేఎన్ డిగ్రీ కళాశాలలో ఈ పరీక్షా ఏర్పాట్లను చేస్తున్నామని.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

=======================

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలలో ఎం.ఏ, ఎం.కామ్, ఎం.ఎస్సీ, ఎం.పీ.డి వంటి కోర్సులలో చేరాలనుకుంటున్న అభ్యర్థులు వచ్చే నెల 5వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య మండలి వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 9వ తేదీ నుండి ప్రవేశ పరీక్షలు జరుగుతాయని సంబంధిత పరీక్షల రాష్ట్ర కన్వీనర్, ఆచార్య పి. సి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

విరామం

=======================

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ విస్తృత సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామని బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సుమారు 7 వేల మంది సిబ్బంది 1,351 శాఖలతో అన్ని జిల్లాల్లో సేవలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 4 గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి... ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులు రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా వినియోగదారులకు సేవలందిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం నాలుగు గ్రామీణ బ్యాంకులను విలీనం చేశామని తెలిపారు. ఈ బ్యాంకుకు ప్రయోజిత బ్యాంక్ గా యూనియన్ బ్యాంక్ ఉంటుందని ఛైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

========================

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం. సుధారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. పేదల సేవలో భాగంగా జిల్లాలోని  లక్షా 39 వేల 752 మందికి 59 కోట్ల 72 లక్షల రూపాయల నిధులను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. మొదటి రోజునే నూరు శాతం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. మండల ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.

========================

ఉత్తర - దక్షిణ ద్రోణి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులోనూ... ఉపరితల ఆవర్తనం 900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపటి వాతావరణ సూచనలను ఇప్పుడు విందాం...

(వాయిస్ 32 సెకన్లు)

========================

అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా అధికారులతో ఈరోజు ఆయన శ్రవణమాధ్యమ సమావేశం నిర్వహించారు. రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలను ముందుగా గుర్తించి.. అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

========================
========================